క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్‌లో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించే ఏఐవైఎఫ్ రెండో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మణాచారి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలపీరు, చిన్నపాగ శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా



వెల్దండ: ఎన్నికల కోడ్ సందర్భంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక తనిఖీలు చేస్తున్నట్లు కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొట్రగేట్ వద్ద ఉన్న చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. కేంద్ర పోలీస్ బలగాలను కొట్రచెక్‌పోస్టు ఉంచామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్, కేంద్ర పోలీస్ బలగాలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మర తనిఖీలు

ఉప్పునుంతల: ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎస్‌ఐ గురుస్వామి ఆధ్వర్యంలో పోలీసులు నిత్యం ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ రహదారితోపాటు ఉప్పునుంతల–అచ్చంపేట ప్రధాన రహదారి, ఇతర మార్గాల్లో వాహనాలను తనిఖీ చేశారు.

చెక్కుల పంపిణీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన సుమకు రూ.47500లు, అదే గ్రామానికి చెందిన ఖాజాభానుకు రూ.15 వేలు సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం లబ్ధిదారుల నివాసాల వద్ద రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్ గౌడ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో భానుచందర్, రుక్మొద్దీన్, దేవయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా మాలమహానాడు ఆవిర్భావ దినోత్సవం



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాల మహనాడు ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ మాలమహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చింతసత్తి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. శ్రీనివాస్, మహేష్, నిరంజన్, లక్ష్మయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

చారకొండ: మండలంలోని జూపల్లిలో గ్యార్మీ వేడుకల సందర్భంగా మహబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారి నుంచి ట్రాక్టర్‌లో ప్రధాన వీధులగుండా గంధాన్ని ఊరేగిస్తూ దర్గా వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు, యువకులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న జి.లక్ష్మాగౌడ్‌కు డాక్టరేట్ లభించింది. ప్రముఖ రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మార్గనిర్దేశంతో 'రసాయన శాస్త్రంలో మూలక రసాయన నానో కణాల సంశ్లేషణ' అనే అంశంపై పరిశోధనకు గాను ఉత్తర ప్రదేశ్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రామచంద్రం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం డాక్టరేట్ పొందిన లక్ష్మాగౌడ్‌ను అభినందించి సత్కరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ సీఐ పరమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మారేడుదిన్నె, యాపట్ల తండా, పెద్దకొత్తపల్లి, సాతాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 1750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పరమేష్‌గౌడ్ తెలిపారు. అదేవిధంగా 405 లీటర్ల కల్లు, 170 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై నిర్లక్ష్యం

- పట్టించుకోని అధికారులు

మన్ననూర్: అటవీ సరిహద్దు ప్రాంతాలలో ఆయుర్వేద వైద్యానికి ఆదరణ ఎక్కువ. మన్ననూర్ ప్రాంతంతో నివసించే ఆదివాసీలు, చెంచులు అనారోగ్యానికి గురైతే ఆయుర్వేద చికిత్సలకు ప్రాధాన్యం ఇస్తారు. అదేవిధంగా సమీప గ్రామీణ ప్రజలు ఇప్పటికి ఆయుర్వేద వైద్యం, మందులపై ఎంతో నమ్మకం, ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కొన్ని ఏళ్ల కిందట మన్ననూర్‌లో ఆయుర్వేద ఆస్పత్రిని నిర్మించారు. ప్రస్తుతం ఆయుర్వేద ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.

పీహెచ్‌సీలో తాత్కాలిక గది ఏర్పాటు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేద వైద్యం కోసం తాత్కాలికంగా ఓ గదిని కేటాయించారు. పీహెచ్‌సీలో ఇరుకుగా ఉన్న గదితో సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న గదిలో కుర్చీలు, రోగులకు బెంచీలు కూడా అందుబాటులో లేక వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల కిందట ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆస్పత్రికి సంబంధించిన వస్తు సామగ్రి, మందులు తదితరాలు పీహెచ్‌సీలోని ఓ గదిలోకి మార్చారు. ప్రస్తుతం ఈ గదిని ఖాళీ చేయించి మరో గదిని కేటాయించారు. ఈ గదిలో ఇరుక్కుగా ఉండటంతో డాక్టర్ కూర్చుని వైద్యం చేసే పరిస్థితి లేదు.

పక్కా భవనం లేక..

ఆయుర్వేద వైద్యానికి పక్కా భవనం లేక కొన్ని రోజులుగా అమ్రాబాద్ మండలంలోని తుర్కపల్లి, వెంకటేశ్వర్లబావి, మాచారం, జంగంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఆయుర్వేద వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలకు దీర్ఘకాలిక రోగాలు, కాలానుగుణంగా వచ్చే వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు చేయించుకునేందుకు వందల సంఖ్యలో రోగులు బారులు తీరడం గమనార్హం. ఇప్పటికి ఈ ప్రాంతంలో ఆయుర్వేదం వైద్యంపై ఎంతో నమ్మకం ఉందంటే అతిశయోక్తి కాదు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

వైద్య సిబ్బంది ముగ్గురు

ప్రస్తుతం ఆయుర్వేద ఆస్పత్రిలో ఒక డాక్టర్, ఫార్మసిస్ట్, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. పక్కా భవనం లేక పీహెచ్‌సీలో ఇరుకుగా ఉన్న గదిలో విధులు నిర్వర్తించలేక తూతూమంత్రంగా ఆస్పత్రికి వచ్చి వెళ్తున్నారు. రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నా ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రికి పక్కాభవనంతో పాటు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యులు రావడం లేదు



ఏదైనా అనారోగ్యం వస్తే ఆయుర్వేద ఆస్పత్రికి వెళ్తాను. ఈ మందులతో రోగాలు నయం అవుతాయని నా నమ్మకం. ఆస్పత్రికి ఎప్పుడు వెళ్లినా వైద్యుడు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఆయుర్వేద ఆస్పత్రి సిబ్బందికి గదులు లేక రావడం లేదని అక్కడి పీహెచ్‌సీ సిబ్బంది చెప్తున్నారు. ప్రజలకు ఆయుర్వేద మందులు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – పర్వతాలు, మన్ననూర్

సౌకర్యం కల్పించండి



పది రోజుల కిందట ఆయుర్వేద ఆస్పత్రి పని తీరు, తనిఖీల కోసం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు వచ్చారు. కనీసం కూర్చోవడానికి కూడా కుర్చీలు అందుబాటులో లేవని వివరించాం. గతంలో మన్ననూర్, కొండనాగుల, సిద్దాపూర్ గ్రామాల్లో తాత్కాలికంగా నిర్వాహణలో ఉన్న ఆసుపత్రులకు గానూ పక్కా భవనాల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఆయుష్ మిషన్ (ఎన్‌ఏఎం) నుంచి రూ. 60 లక్షల నిధులు మంజూరైయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్స్, స్థలం కేటాయించ లేదు. దీంతో నిధులు వాపస్ వెళ్లాయి.

– జాన్‌సన్, వైద్యాధికారి, ఆయుర్వేద ఆస్పత్రి, మన్ననూర్

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి



అజిలాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని వనపట్ల, ఔరాస్‌పల్లి, చందుబట్ల, నర్సాయిపల్లి గ్రామాలలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను నమ్మొద్దన్నారు. జెడ్పీటీసీ శ్రీశైలం, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డ, గైరెడ్డిపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఇంటింటి ప్రచారం

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో శుక్రవారం కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అదే విధంగా అంతిరెడ్డిపల్లిలోని హన్మాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, సర్పంచ్‌లు కాలే లక్ష్మమ్మ, కవిత, వెంకటేశ్వర్‌రావు, భీరయ్య, పత్యనాయక్ ఉన్నారు. మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌తో పాటు కొంత మంది నాయకులు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, ఉపసర్పంచ్ సైదయ్య, నాయకులు తానేష్‌యాదవ్, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని భవాజీపల్లి, గుమ్మకొండ గ్రామాల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హామీలు నమ్మొద్దు

పెంట్లవెల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు ఇస్తున్న హామీలను నమ్మొద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పాలకులు మాయమాటలతో మభ్యపెడుతూ కాలక్షేపణ చేశారని ఆరోపించారు. కొల్లాపూర్‌లో జూపల్లికృష్ణారావు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ గోపినాయక్, పాల్గొన్నారు.

బేటీబచావో–బేటీపడావోపై అవగాహన



కల్వకుర్తి టౌన్: ఆడపిల్ల జన్మిస్తే అదృష్టంగా భావించాలని కల్వకుర్తి సీడీపీఓ ప్రాజెక్టు అధికారి వెంకటమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వడ్డెరబస్తీలో బేటీబచావో–బేటీపడావో కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పించారు. భ్రూణహత్యలు, శిశుమరణాలు తగ్గడం సంతోషకరమన్నారు. మహిళా సాధికారత, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖి సర్వీసుల గురించి వివరించారు. అనంతరం బేటీబచావో–బేటీపడావోకు సంబంధించిన పోస్టర్‌ను మహిళలతో కలిసి ఆమె విడుదల చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, జిల్లా మెంబర్ రేణుక, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లలో ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. నాలుగు దశాబ్దాల కిందట గ్రామానికి తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రస్తుతం సిమెంట్ పెచ్చులూడాయి. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ప్రమాదం జరగముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉండడం వల్ల విద్యార్థులపై పడే ప్రమాదం ఉందని అధికారులు పట్టించుకొని వాటర్‌ట్యాంక్‌ను తొలగించాలని కోరారు.



దేశానికే తెలంగాణ పథకాలు ఆదర్శం

ఊర్కొండ: దేశానికే తెలంగాణ పథకాలు ఆదర్శం నిలిచాయని జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వీరారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జడ్చర్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచార చేయాలని కోరారు. అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, వైస్ ఎంపీపీ అరుణ్‌రెడ్డి, కో ఆప్షన్ కలీంపాషా, నాయకులు గోపాల్‌రెడ్డి ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, గిరినాయక్, జంగయ్య, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షులు కదిరి శేఖర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుబ్బ రవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని తిప్పాపూర్ తండాకు చెందిన కాట్రావత్ జైపాల్ శుక్రవారం సారాను గ్రామానికి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

పశువుల అక్రమ తరలింపుపై..

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల శివారులోని డొంగరోడ్డులో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన షేక్ రసూల్, ఎండీ అజీజ్‌లు అచ్చంపేట పరిసర ప్రాంతాల్లో పశువులను కొనుగోలు చేసి అక్రమంగా హైదరాబాదుకు కబేళాలకు తరలిస్తున్నారు. పక్క సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి వాహనాన్ని అదుపులోకి తీసుకునట్లు వివరించారు. వాహనంలో 10 పశువులు ఉన్నాయని అందులో ఒకటి మృతిచెందిందని పేర్కొన్నారు. తొమ్మిది పశువులను కుప్పగండ్ల శివారులో ఉన్న గురునానక్ గోశాలకు తరలించామని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మూడోసారి గులాబీదే విజయం



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని, 50వేల మెజార్టీతో గెలువబోతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న అచ్చంపేటలో నిర్వహించిన అచ్చంపేట ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ చైర్మన్ తులసీరాం, పదర జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబునాయక్, కౌన్సిలర్ రమేష్‌రావు, పర్వతాలు, రాజు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ కుట్రలు

ఉప్పునుంతల: ప్రజా సంక్షేమ ఏ మాత్రం పట్టని కాంగ్రెస్ నాయకులు కేవలం రాజకీయ లబ్ధికోసమే అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం రైతుబంధు నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని దేవదారికుంట తండాలో కాంగ్రెస్ దిష్టి బొమ్మను దహనం చేశారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటే

నాగర్‌కర్నూల్‌రూరల్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎజెండా ఒక్కటేనని ఆ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల మోసపూరిత హామీలను నమ్మొదని బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొత్తపల్లి కుమార్ అన్నారు. శుక్రవారం కొల్లాపూర్ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేదలకోసం ఏం చేశారని ప్రశ్నించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు ఒక ఎకరం భూమి ఇస్తామని, 10 లక్షలతో ఇల్లు కటిస్తామని అన్నారు. పృథ్వీరాజు, బోనాసి రామచందర్, అంతటి నాగన్న, శ్రీహర్ష,పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి కుమార్

బీఎస్పీకి అండగా ఉందాం

కల్వకుర్తిరూరల్: బీఎస్పీకి అండగా ఉందామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సుద్దకల్, యంగంపల్లి, తర్నికల్ తండాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. రమేశ్ నాయక్, రమేష్, రేణుక, సైదమ్మ ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ను విశ్వసించడం లేదు



అచ్చంపేట: ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ అన్ని అవాస్తవాలే మాట్లాడారని, నియోజక వర్గ ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విశ్వసించడం లేదని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 60 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీసం 6వేల ఎకరాలకు కూడా నీరు అందినట్లు నిరుపిస్తే ఎన్నికల్లో తాను నామినేషన్ కూడా వేయనని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరిశంకర్, గార్లపాటి శ్రీనివాసులు, మాజీ మార్కెట్ చైర్మన్ వై.శ్రీనివాసులు, జి.రాజేందర్, మంత్యానాయక్, కాశన్న యాదవ్, నల్లపు శ్రీనివాసులు, శరణ్‌గౌడు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

తాడూరు: మండలంలోని శిర్సవాడ, తుమ్మలసూరు గ్రామాల బీఆర్‌ఎస్, వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

తెలకపల్లి: మండలంలోని లక్నారం గ్రామానికి చెందిన 25 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు నాగర్‌కర్నూల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సమక్షంలో చేరారు.

అల్పాహారం ప్రారంభం

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ నిరంజన్ శుక్రవారం అల్పాహారం ప్రారంభించి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడి కుటుంబానికి ఆర్థికసాయం



తాడూరు: మండలంలోని గుంతకోడూరులో వృద్ధుడు పర్వతాలు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యారరమేష్ బాధి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండలంలోని కేతేపల్లిలో పలు కాలనీల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, కీటక జనిత వ్యాధుల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. వ్యాధులు సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నిల్వ నీటిలో దోమల లార్వాను నిర్మూలించుటకు అబ్బేట్ ద్రావణాన్ని కలిపినట్లు వారు పేర్కొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం

వెల్దండ: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని కల్వకుర్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆచారి అన్నారు. శుక్రవారం మండలంలోని బైరాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 100 మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కల్వకుర్తిలో బీజేపీ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, నాయకులు జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, హరిప్రసాద్, పరమేష్‌గౌడ్, మల్లికార్జునచారి, మురళి, వెంకట్‌రాములు, వెంకటయ్య, కుమార్, శివ, జంగయ్య, శ్రీశైలం, అల్లాజీ, జయమ్మ, రామేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, ఉషాల, శిరీష, బసవమ్మ, సుజాత, సత్యనారాయణ, వెంకటయ్య, బ్రహ్మం, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



బైరాపూర్‌లో పార్టీ కండువా కప్పుతున్న ఆచారి

ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి

కోడేరు: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. శుక్రవారం మండలంలోని రేకులపల్లి తండా, గుండ్యావ్యాల్యానాయక్ తండాలో పరివర్తన్ యాత్రలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుల్లయ్య, రఘు, పాల్గొన్నారు.

బిజినేపల్లి: తొమ్మిదేళ్లుగా పేదలకు రేషన్‌కార్డులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేయలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రచారం చేశారు. కొండా నాగేష్, లక్ష్మీ నారాయణ, పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలి

చారకొండ: వచ్చే హరితహారం కార్యక్రమం నాటికి నర్సరీలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపల్లి, తుర్కలపల్లి గ్రామాల పంచాయతీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీలో మొక్కలు పెంచేందుకు సిద్ధం చేసిన బెడ్లు, మట్టి బ్యాగులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు రవిశంకర్, కురుమయ్య, ఉపాధి అధికారులు అల్లాజి తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని పల్లుతండా, బండోనిపల్లి, బొల్లంపల్లి, పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలల్లో పెంచుతున్న మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలన్నారు. పండ్ల, పూలు, అలంకరణ మొక్కలను పెంచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏ రాజ్‌కుమార్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మన్ననూర్: స్థానిక పురుగుల గుట్ట వద్ద ఏర్పాటు చేసిన వన నర్సరీని అమ్రాబాద్ ఎంపీడీఓ రామ్మోహన్ శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో ఇప్పటి వరకు 3 వేలు మాత్రమే విత్తనాలు నాటడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో కూడా నాలుగు రోజుల్లో 12 వేల సంచుల్లో విత్తనాలు విత్తాలని గ్రామ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటయ్య, గ్రామ కార్యదర్శి భీముడు ఉన్నారు.



చారకొండలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



మన్ననూర్ నర్సరీలో విత్తనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామ్మోహన్